# పేదల వైద్యానికి సర్కారు అండ

- పీహెచ్‌సీల్లో 67రకాల వైద్య పరీక్షలు
- బీపీ, షుగర్ మందుల పంపిణీ
- నిరుపేదలకు వరంలా సర్కారు వైద్యం


క్యాంపులో రోగులను పరిశీలిస్తున్న డాక్టర్ ఇక్బాల్ (ఫైల్)

నాంపల్లి, అక్టోబర్ 13 : తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక ఏర్పడిన బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు నాణ్యమైన వైద్యం అందించడంపై దృష్టి సారించింది. వైద్యాన్ని అత్యవసర సేవలుగా భావించిన సీఎం కేసీఆర్ ముందుగా ప్రభుత్వ ఆస్పత్రులను ప్రక్షాళన చేసి సమూల మార్పులు చేశారు. అందులో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామీణ దవాఖానలు ప్రస్తుతం సత్ఫలితాలు ఇస్తున్నాయి. ప్రభుత్వ దవాఖానలు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తూ పేదల ఆరోగ్యానికి అండగా నిలుస్తున్నాయి. దాంతో ప్రభుత్వ దవాఖానలకు వచ్చే రోగుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న వారికి అందించే ప్రోత్సాహకాలు సైతం ఉపకరిస్తున్నాయి. ఆశ కార్యకర్తలు గర్భిణులను కంటికి రెప్పలా కాపాడుతూ సూచనలు సలహాలు అందిస్తున్నారు.

### 7ఉపకేంద్రాల ఏర్పాటు

నాంపల్లి మండల కేంద్రంలోని పీహెచ్‌సీతో పాటు, నర్సింహులగూడెం, పెద్దాపురం, వడ్డేపల్లి, గట్ల మల్లేపల్లి, ముష్టి పెల్లి, పసునూరు, మెల్లవాయి గ్రామాల్లో ప్రభుత్వం ఉపకేంద్రాలు ఏర్పాటు చేసింది. మేళ్లవాయిలో నూతన ఉపకేంద్ర భవనం ప్రారంభమై అందులో సేవలు అందిస్తున్నారు. నర్సింహులగూడెంలో ఉప కేంద్ర భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. పెద్దాపురం, వడ్డేపల్లి, గట్ల మల్లేపల్లి, ముష్టిపల్లి, పసునూరు ఉప కేంద్రాల భవనాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వడ్డేపల్లి తప్ప మిగతా ఉప కేంద్రాలకు ప్రభుత్వం వైద్యులను కేటాయించి సేవలు అందిస్తున్నారు.

### 67 రకాల ఉచిత పరీక్షలు

ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి వేల రూపాయలు ఖర్చు చేసి చేసుకునే వైద్య పరీక్షలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా చేస్తున్నారు. రోగుల నుంచి నమూనాలు సేకరించి ఉచితంగా పరీక్షలు చేస్తున్నారు. మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా, డెంగ్యూ, మూత్ర పరీక్షలు , షుగర్, రక్త పరీక్షలు మొదలైన 67పరీక్షలను పూర్తి ఉచితంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేస్తున్నారు.

### బీపీ, షుగర్ మందులు

ఆస్పత్రికి వచ్చే వారే గాక గ్రామాల్లో ఉండే రోగులను ఆశ వర్కర్లు , ఏఎన్ఎంలతో బీపీ, షుగర్ రోగులను గుర్తించి వారి ఇంటి వద్దకే వెళ్లి మందులను పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు చేయించుకున్న మహిళలకు సీఎం కేసీఆర్ కిట్టు అందిస్తున్నారు. అందులో చంటి పిల్లలకు అవసరమైన వివిధ రకాల వస్తువులు అందుబాటులో ఉన్నాయి. అదే ప్రైవేటు ఆసుపత్రిలో ప్రసవం చేయించుకుంటే రూ.50వేల నుంచి రూ.80 వేల వరకు ఖర్చు అవుతుంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్టుతో పాటు ఆడబిడ్డ పుడితే రూ.13 వేలు, మగ బిడ్డ పుడితే రూ.12వేల చొప్పు న అందిస్తున్నది. అంతేగాక ప్రభుత్వ ఆస్పత్రిలో సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలు ఎక్కువగా చేస్తున్నారు. దీంతో గర్భిణులు ప్రసవం చేయించుకోవడానికి ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లడానికి మక్కువ చూపుతున్నారు.

### గర్భిణులకు ఉచిత సేవలు

మండలంలోని గర్భిణులను ప్రతి మంగళవారం, శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. గర్భం దాల్చిన స్త్రీలను వైద్య సిబ్బంది శుక్రవారం 102వాహనంలో తీసుకొచ్చి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం గర్భిణులను వారి ఇంటి వద్ద సురక్షితంగా దింపి వస్తారు.

### వారంలో రెండ్రోజులు టీబీ క్యాంపులు

మంగళవారం, శుక్రవారం మండలంలోని ఏదో ఒక గ్రామంలో టీబీ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేస్తున్నారు. టీబీ వైద్య పరీక్షలతో పాటు సాధారణ రోగులను పరీక్షించి ఉచిత వైద్యంతో పాటు మందులు అందిస్తున్నారు. ఈ క్యాంపులతో ప్రభుత్వం కల్పించే ఉచిత సేవలను ప్రజలకు తెలుపుతున్నారు.

### నాణ్యమైన వైద్యం అందిస్తున్నాం



పీహెచ్‌సీలో 67రకాలకు పైగా వైద్య పరీక్షలు ఉచితంగా అందిస్తున్నాం. అన్ని సబ్ సెంటర్లలో నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయి. మందులు పూర్తిస్థాయిలో సరఫరా అవుతున్నాయి . వ్యక్తిగత జాగ్రత్తలు పారిశుభ్రత పాటిస్తూ పౌష్టికారమైన తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రభుత్వ ఆసుపత్రికి మండలంలో ఉన్న అన్ని గ్రామాల నుంచి వైద్య సేవలకు ఆస్పత్రికి వస్తున్నారు గతంలో కంటే అధిక సంఖ్యలో రోగులు వస్తున్నారు.

– డాక్టర్ ఇక్బాల్, నాంపల్లి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

## బీఆర్ఎస్ గెలుపునకు సమష్టిగా కృషి చేయాలి

- ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి
- బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం

మునుగోడు, అక్టోబర్ 13 : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేయాలని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండలకేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని గ్రామాల వారీగా నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల బూత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నెల రోజులు నా కోసం పనిచేయండి. 60 నెలలు మీ కోసం పని చేస్తానన్నారు. మునుగోడును అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని అన్నారు. మునుగోడు నియోజక వర్గం పేరు మారుస్తారని అసత్య ఆరోపణ చేస్తున్నారు నా ప్రాణం ఉన్నంత వరకు నియోజక వర్గం పేరు మార్చే ప్రసక్తే లేదన్నారు. ఈ నెల 28 న మునుగోడులో జరగబోయే సీఎం కేసీఆర్ సభలోనే మునుగోడును మున్సిపాలిటీగా, మండల కేంద్రంలో 30 పడకల ఆసుపత్రిని సీఎం కేసీఆర్ తోనే చేపిస్తానన్నారు. ఇదే విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే ప్రచారం చేయాలన్నారు. బూతు కమిటీ సభ్యులు ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం కేసీఆర్ చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని కోరారు. తెలంగాణలో గెలిచేది బీఆర్ఎస్సేనని ఆశాభావం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బండ పురుషోత్తం రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు,గ్రామశాఖ అధ్యక్షులు, ముఖ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్ సభకు స్థల పరిశీలన

మునుగోడు, అక్టోబర్13 : ఈ నెల 26న సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మునుగోడుకు రానున్న నేపథ్యంలో డీఎస్పీ శ్రీధర్ రెడ్డి శుక్రవారం మండల కేంద్రంలోని చౌటుప్పల్ రోడ్డులో ఉన్న స్థలాన్ని పరిశీలించారు. అనంతరం సీఐ ఎస్ఐతో శాంతి భద్రత విషయాలు గురించి ఆరా తీశారు. ఆయన వెంట చండూరు సీఐ వెంకటయ్య, స్థానిక ఎస్ఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.


సభ స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

## 15 నుంచి దేవీ శరన్నవరాత్రులు

చిట్యాల, అక్టోబర్ 13 : చిట్యాలలోని కనుకదుర్గ ఆలయంలో ఆదివారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ శీలా సత్యనారాయణ, ఆలయ అధికారి అంబటి నాగిరెడ్డి, అర్చకులు దౌలతాబాద్ వాసుదేవశర్మతెలిపారు. శుక్రవారం ఉత్సవాలకు సంబంధించిన కర పత్రాలను విడుదల చేసిన సందర్భంగా వారు మాట్లాడారు. 23 వరకు నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా 17న మంగళవారం 108 రకాల ప్రసాదాలతో అమ్మవారికి నివేదన, 19న 108 చీరెలతో అమ్మవారికి అలంకారాలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గంజి వెంకటేశం, పోకల అచ్చాలు, బుద్ద విమల, సాయిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, జిట్ట శేఖర్, వరకాంతం నర్సిరెడ్డి పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

## గొల్ల, కురుమల అభ్యున్నతికి ప్రభుత్వ కృషి

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోటకూరి శంకర్ యాదవ్

మర్రిగూడ,అక్టోబర్ 13 : గొల్ల కురుమల ఆర్థికాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోటకూరి శంకర్ యాదవ్ అన్నారు.శుక్రవారం మండలకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో మంది లబ్ధిదారులకు 600 గొర్రెల యూనిట్లు మంజూరు కాగా పశువైద్యాధికారుల పర్యవేక్షణలో పంపిణీ చేసినట్లు వెల్లడించారు. మునుగోడు ఉప ఎన్నిక తర్వాత అర్హులందరికీ యూనిట్‌లు అందేలా ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారని పేర్కొన్నారు. త్వరలో జరుగనున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తేనే మునుగోడు మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న బీఆర్ఎస్‌ను ప్రజలందరూ మరో సారి ఆశీర్వదించాలని కోరారు.బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## 18 నుంచి పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు


విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సభ్యులు

చౌటుప్పల్, అక్టోబర్13 : చౌటుప్పల్ పట్టణకేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో ఈ నెల 18,19,20 తేదీల్లో విగ్రహప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరి ంచారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొబ్బిళ్ల దనేశ్, దేశగాని సత్యనారాయణ, గుండ్ల శంకరయ్య, అన్నమోని గోవిందరాజు,బొబ్బిళ్ల శ్రీరాములు, పాశం రామరాజు, బొబ్బిళ్ల శ్రీనివాస్, బుట్టి యాదయ్య, బొబ్బిళ్ల రాజేందర్, కాళేశ్వర్ పాల్గొన్నారు.

## శివాలయంలో మాస కల్యాణం

మేళ్లచెర్వు, అక్టోబర్ 13 : మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మేళ్లచెరువులో గల స్వయంభూ శంభులింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి మాస కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ సందర్భంగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, మాస కళ్యాణం, నీరాజన మంత్ర పుష్పాలు నిర్వహించారు. కార్యక్రమంలో రెనివేషన్ కమిటీ చైర్మన్ వర్ర వెంకట్‌రెడ్డి, ఆలయ ఈఓ గుజ్జు కొండారెడ్డి, ఆలయ అర్చకులు కొంకపాక శివ శిష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, ఆలయ సిబ్బంది కే.కొండారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ఎల్.నర్సింహారెడ్డి, రికార్డ్ అసిస్టెంట్, భక్తులు పాల్గొన్నారు.

## సరుకులు పంపిణీ

చౌటుప్పల్, అక్టోబర్ 13 : చౌటుప్పల్ మున్సిపాలిటీపరిధిలోని తంగడపల్లి 4వ వార్డులో నిరుపేద కుటుంబానికి చెందిన నందగిరి రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దాంతో శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యులకు కేవీఎస్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన లింగాల రామకృష్ణా గౌడ్, గోద లింగస్వామి గౌడ్ సహకారంతో నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కొండమడుగు శ్రవణ్ కుమార్, నాయకులు బొడ్డు ముత్యంగౌడ్, రాగీరు సత్యనారాయణ గౌడ్, రావుల ముత్యాలు, జిట్ట శివ కృష్ణా యాదవ్, కేతరాజు బాలకృష్ణా, ఎండీ అస్లాం ఖాన్, రావుల లింగస్వామి, ఉబ్బు ఉపేందర్ పాల్గొన్నారు.


నిత్యావసరాలు అందజేస్తున్న నాయకులు